


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఇంటింటా వ్యాపారం

**మా చిన్నప్పుడు** అందరూ రెండు రూమ్‌లు అద్దెకి తీసుకుని టైప్ ఇనిస్టిట్యూట్‌లు పెట్టేవారు. మేమంతా అదో రివాజుగా, కాయితం దోశ పొట్లంలా రౌండ్‌గా మడిచి పట్టుకుని, టెన్త్ క్లాస్ అవగానే టైప్ నేర్చుకోవడానికి ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళడం సరదాగా వుండేది.

టీ.వీలు వచ్చాయి. సాయంత్రం పాలూ, చేలూ కార్యక్రమం తర్వాత పళ్ళాలూ, చెంబులూ డాన్స్‌లొచ్చేవి. అంటే భరత నాట్యాలు.

శంకరాభరణం సినిమా వచ్చాక ఇంటింటా సంగీతం, డాన్స్ మస్ట్‌గా వుండేది.

ఆ ట్రెండ్ పోయి, మేం కాలేజీలకొచ్చాక కొత్తగా ఆఫీసుల్లో, తలలు నెరిసిన పెద్దవాళ్ళందరినీ, కంప్యూటర్లు నేర్చుకోమన్నారు. పాపం, ఇంకో ఏడాదిలో రిటైర్ అయ్యేవాళ్ళకి పెద్ద అగ్ని పరీక్షే వచ్చి పడింది. కాలూ, చెయ్యీ, లేదా ఇంకా ఏదైనా లోపాలుంటే ప్రభుత్వం ఫోన్ బూత్‌లు పెట్టుకోమనే సరికి పేజర్లూ, ఫోన్ బూత్‌ల కెళ్ళడాలూ యువతకి ఫ్యాషన్ అయింది. ప్రతి సిగరెట్‌లు అమ్మే బడ్డీకొట్టు పక్కనా లిడ్‌కాప్ వారి చెప్పులు కుట్టే డబ్బాలు ఒక టైంలో ట్రెండింగ్. తర్వాత చెప్పులు కుట్టించుకోడం, కుట్టిన చెప్పులు కొనుక్కోడం మానేసి, షాపుల్లోనే కొనడం మొదలుపెట్టేసరికి లిడ్‌కాప్ పెట్టెలు మూసుకుపోయాయి. ఫోన్ బూత్‌లొచ్చాయి.

ఫోన్ బూత్ కెళ్ళి నిలబడ్తే, వారపత్రికల్లో కన్నా మంచి మసాలా ప్రేమ కథలు చెవిన పడేవి. గంటలు గంటలు. రింగ్ వచ్చినప్పుడల్లా. మిషన్‌లో రూపాయి బిళ్ళ వేస్తూ ప్రేమికులు ఆ పెట్టెల వాళ్ళని పోషించారు.

తర్వాత టైప్ ఇన్సిటిట్యూట్‌లు మూసుకునిపోయి, కంప్యూటర్ సెంటర్లూ, చాటింగ్ పార్లర్లూ వచ్చాయి.

నేనూ ఎనిమిదో తరగతిలో భరతనాట్యంలో చేరి, తొమ్మిదిలో సంగీతం క్లాసులు ఎటెండ్ అయి, పదో క్లాసులో టైపింగ్ నేర్చుకుని, నాట్యం, సంగీతం గుంట తీసి గంట కొట్టి, టైప్ లోయర్ పాసయ్యాను.

హయ్యర్ కూడా డిగ్రీతో పాటు గట్టెక్కిచ్చేదాన్నే. ఇంతలో ఇంటర్ తర్వాత పెళ్ళి అయింది.

శంకరాభరణం, సప్తపదీ పాత పడ్డాక, మళ్ళీ భరతనాట్యం, సంగీతం క్లాసులకి పంపడం మానేసి పిల్లల్ని రామయ్యలూ, చలమయ్యలూ అని ఎమ్.సెట్ కోచింగ్‌లకి పంపడం మొదలు పెట్టారు.

గజ్జెలూ, హార్మోనియం, వీణలూ అలంకరణ వస్తువులయ్యాయి. కూరగాయల బండ్ల దగ్గరా, పొద్దుటే పాల బూత్‌లలోనూ కూడా "ఎక్కడ కోచింగ్ తీసుకుంటే మీ అబ్బాయికి ర్యాంక్ వచ్చింది? ఫ్రీ సీట్ వచ్చిందా?" అన్న డిస్‌కషన్స్‌తో తల్లులు పుచ్చులు చూడకుండానే

చిక్కుడు కాయలూ, వంకాయలూ సంచీల్లో వేసేసుకోవడం మొదలుపెట్టారు. విధిగా ఆడపిల్ల అయినా మగపిల్లాడైనా, ఇంజనీరో, డాక్టరో అవ్వాల్సిందే అన్నది రూల్‌గా మారింది.

కన్జ్యూమరిజం ఎంత వేగంగా మన జీవితాల్లోకి వచ్చి, చాపకింద నీళ్ళల్లా జీవితాలని మార్చేసిందంటే, సందు చివర పచారీ షాప్ గురవయ్యలు, అరువు ఇచ్చి నెలంతా, నెల చివర డబ్బులు తీసుకునే వాళ్ళు కరువయ్యారు. సూపర్ మార్కెట్‌లే, ఉల్లిగడ్డ అయినా, అల్లం అయినా బేరం లేదు. ఫిక్స్‌డ్ రేట్లు. అరువు బేరంలేదు.

చెప్పు తెగితే కుట్టే కొండయ్యలేడు. అవి డస్ట్‌బిన్‌లో పారేసి షాప్‌కి వెళ్ళి వాళ్ళు చెప్పిన రేటుకి ఓ రూపాయి అటో ఇటో బేరం ఆడి కొనుక్కోవడమే. బట్టల షాపుల్లో అరువులు లేవు. పెరుగూ పాలకి పద్దులు లేవు. పూల వాడకం, కూరల వాడకం అసలే లేదు. అన్నింటికీ క్యాష్ డౌన్. పెద్ద పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లొచ్చాయి. లైఫ్‌లోకి కాంప్లెక్సిటీ, క్రెడిట్ కార్డ్ రూపంలో దర్శనం ఇచ్చింది. ఎంతైనా అప్పు తీసుకో అంటూ 'అప్పు చెయ్యకు, వున్నంతలో బతుకు' అన్న పెద్దల నీతుల్ని గోతుల్లో తొక్కి, "అప్పు చెయ్యి... కొను.. కొను' అని యువతని వూదర గొట్టసాగింది. పేజెర్లు పోయాక వచ్చిన ఫోన్లూ, సెల్‌ఫోన్లూ. మనకన్నా, బ్యాంక్ లోన్‌లు ఇస్తాం. రిసార్ట్స్ మెంబర్ షిప్స్ తీసుకోండి, ఫ్లాట్లు అమ్ముతున్నాం. ప్లాట్లు వేస్తున్నాం బుక్ చేసుకోండీ అనే వాళ్ళకి ఎక్కువ పనికొచ్చాయి. మొదట్లో ఏడు రూపాయలకి ఒక కాల్ వుండేది. కొద్దిగా పిసినారిగా పొదుపుగా సెల్‌ఫోన్ వాడేవాళ్ళం. ఆ తర్వాత రూపాయి ఫోన్ కాల్ అయింది. ఎవరడిగితే వాళ్ళకి సెల్‌ఫోన్లు ఇచ్చారు. కూరగాయల వాళ్ళు, వాకిట్లో కొచ్చే బిచ్చగాళ్ళు అందరికీ సెల్‌ఫోన్లు. నెల చివరకి బోలెడు బిల్లులొచ్చేవి. కట్టేవాడెప్పుడూ అప్పిచ్చేవాడికి లోకువ. అందుకనే చీటీల వ్యాపారాలు పోయి చిట్‌ఫండ్స్ వచ్చాయి. ష్యూరిటీ సంతకం తెస్తే, చిట్ కట్టుకోవచ్చు. చిట్ పాడుకున్న వాడు దొబ్బేస్తే, ష్యూరిటీ వాడు ఇల్లు తాకట్టు పెట్టి చీటీ డబ్బులు మిగిలిన నెలలవి కట్టాలి.

మా పెళ్ళయిన కొత్తల్లో ఇట్లా ష్యూరిటీ సంతకాలు పెట్టి ఇళ్ళు అమ్ముకున్నవాళ్ళు ఎందరో.

ఇంక షాపింగ్ కాంప్లెక్స్‌లో మల్టీ ప్లెక్స్ థియేటర్లు వచ్చాయి. టికెట్ వందరూపాయలూ, కోకోకోలా 150రూ, పాప్‌కార్న్ 90 రూపాయలూ, సమోసా 50 రూపాయలు కార్ పార్క్ చేస్తే 40 రూపాయలు.. ఓ మధ్య తరగతి కుటుంబం సినిమాకి వెళ్తే పిల్లలతో 2,000 / - కళాస్.

బ్యాంక్‌లోన్లూ, ఈ.ఎం.ఐ.లు మీద ప్రతివాళ్ళూ ఫ్లాట్స్ కొనడం మొదలయింది. ఈ ఈ.ఎం.ఐలు కట్టలేక బలవన్మరణాల పాలయిన వాళ్ళు కొందరు నాకూ తెలుసు. జీవితంలో అంతా మెట్లెక్కి పైకి ఎక్కేవారు వైకుంఠపాళి ఆడే రోజుల్లో. కానీ ఇప్పుడు ఒక్కసారిగా లిఫ్ట్ ఎక్కి పైకి వెళ్ళేవాళ్ళే. ఉద్యోగం రాగానే సగం జీతం కారు లోన్‌కీ, ఇంటి ఈ.ఎం.ఐకి.

పాత రోజుల్లో ఇంటి ఆసామి రిటైరయితే వచ్చిన డబ్బులతో ఇల్లు కొనుక్కుని, భార్యతో వానప్రస్థంలా గడిపేవాడు. అది ఇల్లు ఏర్పరుచుకునే వయసు అనుకునేవారు. సిటీ బస్సులున్నది జనం తిరగడానికీ, ఆటోలున్నది అత్యవసరానికీ అనుకునేవారు. టాక్సీలు మనబోటి వాళ్ళకి కాదనుకునేవారు. నాలుగు అంకెల జీతగాడు కూడా మా చిన్నప్పుడు, ఆఫీస్ వాళ్ళు టికెట్ ఇస్తే తప్ప ఎయిరోప్లేన్ ఎక్కలేదు స్వంత డబ్బెట్టి.

ప్రపంచం వేగవంతం అయింది. పిల్లలకి పబ్లిక్ స్కూల్స్, బోలెడు డొనేషన్లు తల్లితండ్రులకి ఇంటర్వ్యూలు. ఎంత సంపాదిస్తున్నారో తెలుసుకోడానికి. వాళ్ళకోసం తల్లులకి వాట్సప్ గ్రూప్‌లు. ఇంక మా అమ్మమ్మగారిని చూడ్డానికి ఆచారిగారు ఇంటికొచ్చి బి.పి చూసేవారు. రెండు రూపాయలిచ్చేవాళ్ళం. ఆర్.టీ.సీ ఆస్పత్రిలో సీసా తీసుకెళ్తే మాకు ఓ మిక్స్‌చర్ పోసి ఇచ్చేవారు సీసాలో, అది సర్వరోగనివారిణి. దగ్గూ, జలుబూ, జ్వరం, అజీర్తికి. మాకు ఫ్రీ, అమ్మ ఆర్.టీ.సీ ఉద్యోగం చెయ్యడంవల్ల. మా అమ్మ మనవలు పుట్టాక కూడా బస్ ఎక్కి 'స్టాప్' అనడం విని మా అన్నయ్య కొడుకు శరత్ (ఇప్పుడు చాయ్ బిస్కెట్ శరత్ అనిపించుకుంటూ, సినిమాలు తీసే ప్రొడ్యూసరయ్యాడు) వాడు ఆటో ఎక్కినా స్టాప్ అనేవాడు. అలా అంటే డబ్బులియ్యక్కర్లేదని వాడికి తెలిసింది పాపం ఆ వయసులో

ప్రైవేట్ ఆస్పత్రులకి మా పురుళ్ళప్పుడు వెళ్ళడం మొదలయింది. అప్పటిదాకా జడ్జిఖానా, గాంధీ ఆస్పత్రులే. ఇంక ఒక్కసారిగా ఐదు నక్షత్రాల హాస్పిటల్స్ ప్రజల మీదకి దూసుకొచ్చాయి. కార్పోరేట్ ఆస్పత్రులొచ్చి అప్పుల్లో ముంచాయి కుటుంబాలని.

రోగాలు పెరిగి ఇన్ని స్టార్ హాస్పిటల్స్ వచ్చాయో. హాస్పిటల్స్‌ని ఫీడ్ చెయ్యడానికి ఇన్ని రోగాలొచ్చాయో అర్థంకావడం లేదు.

'ఇచ్చట ప్రైవేట్లు చెప్పబడును' బోర్డ్‌లు పోయాయి. ట్యుటోరియల్స్ ఆ తర్వాత కోచింగ్ సెంటర్లు, తల్లితండ్రుల రక్తం జలగల్లా పీల్చాక పిల్లలు అమెరికాలకి వెళ్ళి డాలర్ గుడ్లు పొదగడం మొదలయింది. దాంతో మళ్ళీ పిల్లాడ్ని అమెరికా పంపించాలి. పదిహేను లక్షలు మా ఎకౌంట్‌లో చూపించాలి అని తల్లితండ్రులు బయల్దేరితే అయిన వాళ్ళు కొంతమంది హెల్ప్ చేసేవాళ్ళు, లేదా కన్‌సల్టెన్సీలు వచ్చాయి. మీ పిల్లవాడు అమెరికాకి వెళ్ళి యూనివర్సిటీలో చేరేదాకా మాదే పూచీ అని. మా పెద్దబ్బాయికి నేను వీశూ కన్సల్టెన్సీలో 12,000 కడితే వాళ్ళు పేపర్లు సరిగ్గా పంపక, యూనివర్సిటీ అప్లికేషన్ పక్కన పెట్టేసింది. నేను అనుకోకుండా అమెరికా వెళ్ళి ఫోన్ చేసి తెలుసుకుంటే, పేపర్లన్నీ రాలేదని తెలిసి, మా అబ్బాయికి చెప్పి వాడు పంపించుకుంటే సీట్ వచ్చింది. ఇలా కన్సల్టెన్సీలవల్ల మోసపోవడాలు.

ప్రీ స్కూల్‌లో చేర్పించడానికి లక్షల ఫీజ్‌లు రెండున్నర ఏళ్ళవాడికి. నేను ఇంగ్లీషు మీడియం కాబట్టి తొమ్మిదిరూపాయల ఫీజు కట్టేదాన్ని. మా అన్నయ్యకి తెలుగు మీడియంకి పదో క్లాసుదాకా ఆరు రూపాయలే. స్కాలర్ షిప్ తెచ్చుకున్నాడు. అదీ కట్టలేదు. బి.ఏలో మూడేళ్ళకీ కలిపి మా అమ్మ 900 /- కట్టింది. ఇప్పుడు చంటాడు యు.కెజి దాటేసరికే అరెకరం అమ్మాల్సొస్తోంది.

పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్కే రోజులు పోయాయి. ఇంట్లో భార్యాభర్తా, ఇద్దరు పిల్లలూ వుంటే నాలుగు బండ్లూ, వాటికి రోజూ పెట్రోల్ బిల్లులూ.

పిల్లలకి బస్‌పాస్‌లు అంటే చెప్పడం నామోషీ

పుట్టిన పసివాడికి ఎయిర్‌పోర్ట్‌లు తప్ప రైలు స్టేషన్, బస్‌డిపోలూ తెలియవు. మిడిల్ క్లాస్ వాళ్ళకి కూడా ఫాల్స్ ప్రిస్టేజ్‌లు. మరి మరి ఈ ఖర్చులు ఎలా తట్టుకోవాలి? కారు, ఇల్లు, పిల్లలకి కాన్వెంట్లు, రోగాలొస్తే కార్పోరేట్ హాస్పిటల్స్, సినిమాకి వెళ్ళాలంటే మల్టీఫెక్స్ థియేటర్లు, హోటల్‌కి వెళ్తే ప్లేటు వెయ్యి రూపాయల బిరియానీలు. కాఫీ కప్ ఆర్ కెఫేల్లో 350 రూపాయలు కాఫీలు. పిజ్జా తెప్పిస్తే మీడియం 800/- పెద్దది 1200 నుండీ 1400 రూపాయలు.

మా చిన్నప్పుడు ఆడవాళ్ళు వేడి నీళ్ళకి చన్నీళ్ళు సాయం అని కుట్టుమిషన్లు పెట్టుకుని బట్టలు కుట్టి, సంసారాన్ని ఆదుకునేవారు. చదువుకున్న ఆడవాళ్ళు అయితే ప్రైవేట్లు చెప్పేవాళ్ళు. చదువురాని వాళ్ళు వంటలకి సహాయకులుగానో, స్వగృహలాంటివి లేకపోయినా ఇళ్ళల్లో పిండివంటలు, పచ్చళ్ళూ పెట్టి అమ్మడమో చేసేవాళ్ళు. ఉద్యోగాలకి వెళ్ళేవాళ్ళు సరేసరి.

అప్పుడు మందుల కంపెనీలు ప్యాకింగ్ గర్ల్స్, డోర్ టు డోర్ సేల్స్ గర్ల్స్, ఇంకా చాలా ఉద్యోగాలు మేన్యువల్‌గా చేసేవీ వుండేవి. కాలక్రమేణా మిషిన్స్ వచ్చి, అవన్నీ మిషిన్సే చేయడం మొదలయింది.

సమస్య వస్తే మనిషి పరిష్కారం వెతుకుతాడు. దార్లు మూసుకుపోతే, కొత్తదారి నిర్మిస్తాడు. అదీ మానవుడి మేధ.

ఇంట్లో వుండే ఆడవాళ్ళకి సైతం టెక్నాలజీ వాళ్ళ చేతి ఆయుధం అయింది డబ్బు సంపాదనకి. దాంతో ఒక్కసారిగా యూ ట్యూబ్‌ల మీద పడ్డారు సంపాదనకి. 90 ఏళ్ళ 'మస్తానమ్మ వంటల' దగ్గరనుండీ, 'కామేశ్వరరావు కరోనా కషాయం'దాకా యూ ట్యూబ్‌ల్లో వ్లాగులు. "మా వారు రాత్రి మల్లెపూలు తెచ్చారు." అని ప్రారంభం అయి ఈవిడ ఎంగిలి పళ్ళాలు తోమి గ్యాస్ స్టౌ తుడిచి పడుకునే దాకా ఓ వ్లాగ్. ఇంకోడు 'పులివెందులనుండీ బెంగుళూరు స్కూటర్ యాత్ర', ఇంకో అమ్మాయి తన నగల కలెక్షన్. ఇంక ఎన్.ఆర్.ఐలు తమ దేశంలో వంటలూ, ఇళ్ళూ, పిల్లల పెంపకం, తోటలో కూరగాయలూ..

ఇవన్నీ కావని కొందరు "రైట్స్" అవీ తీసుకోకుండానే ఏ రచయిత నవల అందితే అవి చదివేస్తున్నారు. "ఇదేంటమ్మా నా నవల చదువుతున్నావ్? రైట్స్ ఎవరిచ్చారూ?" అంటే "మాకు రైట్స్ తీసుకోవాలని తెలవదండి" అంటారు.

వణికే గొంతుతో ఓ వెంకటమ్మ "శోభనం రాత్రినాడు, మందాకిని భుజం మీద చెయ్యివేసి ప్రకాశం దగ్గరగా లాక్కుని ...ఖళ్...ఖళ్" అని దగ్గాడా. కాదు. ఈవిడ వయస్సు వయోభారం వల్ల పాపం ఆవిడకి దగ్గొచ్చింది. శోభనం ఘట్టం. ఈ ముసలావిడ రసవత్తరంగా చదవబోతే దగ్గు రాకూడదని తెలీని వెర్రిబాగుల దగ్గు. వాళ్ళ భాషా, ఆ చదివే స్టైలూ వినలేక చచ్చిపోతున్నాం. "ఈ లోకం కల్లు లేనిది, కుల్లుబోతు మనుషులు కలావతీ, మనని అర్థం చేసుకోదు అంటాడు గనపతి" 'ళ', 'ణ' అక్షరం ఎప్పుడో బుడమేట్లో వదిలిపెట్టేసారు. కాపీరైట్స్ అనే చట్టం గురించి తెలిసినా "ఆ చూడొచ్చారా!" అని తుంగలో తొక్కి ప్రతి అప్పలమ్మా వంటపని కాగానే ఎవరిదో ఒకరిది నవల పట్టుకుని, వంద అచ్చుతప్పులతో, అక్షరదోషాలతో చదివిపారెయ్యడమే.

వీళ్ళకి చెప్పి చెప్పి విసుగొచ్చి యూ ట్యూబ్‌కి రిపోర్ట్ చేస్తే, మెయిల్ బాక్స్‌లో కొచ్చి, "ఇంటెడు కష్టాలు చెప్పి మీ అభిమానులం ఇలా చెయ్యకండి, ఇంట్లో అందరికీ కరోనా వచ్చింది. నాకు ఏదైనా ఉద్యోగం కావాలి" అని ఏడుపు. అసలు యూ ట్యూబ్‌లో ఏది అప్‌లోడ్ చేసినా కొంత ఫీజ్ పెడితే, ఒక్కడు ముందుకి రాడు ఇలాంటి అల్లాటప్పాగాళ్ళు.


టివి ఛానెల్స్ కన్నా పాపులర్ అయిపోతున్న యూ ట్యూబ్ ఛానెళ్ళలో, సినీతారల జీవితాల మీద అబద్దాలు చెప్పి సొమ్ము చేసుకుని బతికేవాళ్ళు కొంతమంది. అబద్దాలు చెప్పి బతికేవాళ్ళు కొంతమంది. కొంతమంది రచనలు మీద సొమ్ము చేసుకునీ, చచ్చిపోయిన వాళ్ళవి మరీ రాజసంగా దోచుకుని బతికేసేవాళ్ళు కొంతమందీ, ఇట్లా  స్వగృహ సంపాదనలు మొదలు పెట్టేసారు ఇంటింటా వ్యాపారం యూట్యూబ్‌ల మీద పడి చాలామంది.

ఈ "యూ ట్యూబ్ సార్స్"ని సినిమా ఏక్టర్లని చూసినట్లు ఎగబడి చూస్తారట బయటకనిపిస్తే. గొర్రెల మంద ప్రజలు కొంతమంది. ఆ తర్వాత వీళ్ళ పాపులారిటీ చూసి బిగ్ బాస్‌లాంటి కార్యక్రమాల్లో ఈ టిక్ టాక్ సుందరుల్నీ, యూ ట్యూబ్ డాషింగ్ నటీనటుల్నీ తీసుకోవడంతో అస్సలు డిమాండ్ ఆకాశం అంటుతోంది.

కరోనా కన్నా పెద్ద అంటు రోగం పాపులారిటీ పిచ్చి. ఈ వెర్రి ఎన్నాళ్ళో చూడాలి.




Post your comments







https://www.youtube.com/watch?v=ERaaX_IulS4